బీఆర్ఎస్ ప్రగతి పాలనలో ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి

వర్ధంతి సందర్భంగా కేసీఆర్ నివాళి

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : పదేండ్ల పాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రగతి పాలనలో ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నేడు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసే దిశగా పాలన అందించిననాడే వారికి ఘన నివాళి అర్పించిన వారమవుతామని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకోసం తన జీవితాన్ని అర్పించిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి శుక్రవారం సందర్భంగా ఆయన త్యాగాలను, స్ఫూర్తిని కేసీఆర్ స్మరించుకొన్నారు. తెలంగాణ రాష్ట్ర కోసం సాగిన చివరి దశ పోరాటంలో, ఉద్యమ రథ సారథిగా తనను ముందు నడుపుతూ ఆయన అందించిన ప్రోత్సాహం జీవితంలో మరువలేనిదని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ సాధన కోసం అనుసరించాల్సిన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యూహాలకు తన ఉద్యమ కార్యాచరణకు ప్రొఫెసర్ జయశంకర్ ఇచ్చిన సైద్ధాంతిక నైతిక మద్దతు మహోన్నతమైనదని కేసీఆర్ కొనియాడారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది?

- 2 లక్షల ఉద్యోగాల ఊసేలేదు
- జీవో 46పై స్పందన కరువు
- కాంగ్రెస్‌ది దగా పాలన
- ఉద్యోగాల సంఖ్యను పెంచాలి
- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ ఏమైందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హామీ మేరకు జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. తెలంగాణభవన్‌లో గురువారం నిరుద్యోగులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువత అరిగోస పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు కోసం ఓటేసిన పాపానికి యువతను వేధిస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ తీరుతో అన్నివర్గాల ప్రజలు రోడ్డెక్కుతున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ సాకుతో అన్నింటినీ ప్రభుత్వం వాయిదా వేసిందని, కోడ్ ముగిసిన తర్వాత ఏ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. గ్రూప్-1లో 1:100 చొప్పున మెయిన్‌కు ఎంపిక చేయాలని, గ్రూప్-2లో 2 వేల పోస్టు లు, గ్రూప్-3లో 3 వేల పోస్టుల చొప్పు న మలి నోటిఫికేషన్లు ఇవ్వాలని, డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉండగా జీవో 46పై పోరాడిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక స్పందించడంలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, దగాపాలన అని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఉద్యోగాలిస్తారా.. గద్దె దిగుతారా?

మొదటిపేజీ తరువాయి...

హెచ్చరించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడాన్ని నిరసిస్తూ 5,000 మందికిపైగా నిరుద్యోగులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గురువారం మహాధర్నా నిర్వహించారు. హామీలను నెరవేర్చకపోతే రాష్ట్రంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రేవంత్ సర్కారును హెచ్చరించారు. గ్రూప్-1లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 1,600 పోస్టులు పెంచాలని, గ్రూప్-2లో 2,000, గ్రూప్- 3లో 3,000, డీఎస్సీలో 25,000 వరకు టీచర్ పోస్టులు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్ కోసం 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని, పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన జీవో 46 రద్దు చేయాలని, గురుకులాల రిక్రూట్‌మెంట్‌లో మిగిలిన టీజీటీ, పీజీటీ పోస్టులను వెయిటింగ్ జాబితాలో ఉన్న వారికి ఇవ్వాలని కోరారు.

ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగులు నిర్వహించిన ధర్నాకు మద్దతు ప్రకటించి మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్, చిత్రంలో నాయకులు గెల్లు శ్రీనివాస్, ఆర్ కృష్ణయ్య, వాసుదేవరెడ్డి, తుంగ బాలు తదితరులు

జాబ్ క్యాలెండర్ ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు

ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టి ఆరునెలలైనా జాబ్ క్యాలెండర్ ఎక్కడా ? అని నిరుద్యోగులు నిలదీశారు. హామీ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి తీరాల్సిందే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తరపున ఎన్నికల ముందు బల్మూరి వెంకట్, చింతపండు నవీన్, హర్షవర్ధన్‌రెడ్డి నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి, తమను మభ్యపెట్టారని విమర్శించారు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా ప్రభుత్వం నిరుద్యోగులను మోసగిస్తున్నదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పైగా మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన 30 వేల పోస్టులకు పోస్టింగ్ ఆర్డర్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నట్టు దుయ్యబట్టారు. నిరుద్యోగుల మహాధర్నాకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మహాధర్నాలో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బక్క జడ్సన్, నిరుద్యోగుల తరపున ప్రతినిధులు పాల్గొన్నారు.

రేవు దాటినంక బోడ మల్లన్న తీరుగా..

నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను రేవంత్ సర్కారు నెరవేర్చలేకపోతున్నది. రేవు దాడేదాక ఓడ మల్లన్న.. రేవు దాటినంక బోడ మల్లన్న.. అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులతో వ్యవరిస్తున్నది. గ్రూప్-2, గ్రూప్-3లో నోటిఫికేషన్‌లో పోస్టులు పెంచకుండా, మెగా డీఎస్సీ ప్రకటించకుండా చెలగాట మాడుతున్నది. ఎప్పటికైనా తెలంగాణ నిరుద్యోగులకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీనే. ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుద్యోగులకు అన్యాయం జరుగకుండా చూసుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

-తుంగ బాలు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పోరాటాలతోనే ఉద్యోగాలు సాధ్యం

పోరాటాలు, ఉద్యమాలతోనే ఉద్యోగాలు సాధ్యమవుతాయి. కొత్తగా ఏర్పడిన 23 జిల్లాల వల్ల రాష్ట్రంలో పోస్టుల సంఖ్య పెరిగింది. దాని ప్రకారం గ్రూప్-1లో 1,600, గ్రూప్ 2లో 2,000, గ్రూప్ 3లో 3,000తోపాటు డీఎస్సీ నోటిఫికేషన్‌లో 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. గ్రూప్-4లో 8,500 పోస్టులే ప్రకటించారు. కానీ, 25 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయి. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ తరపున మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో మాట్లాడుతూ.. గూప్-1 మెయిన్స్ 1:100 అభ్యర్థులు పిలువాలని ఆనాడు డిమాండ్ చేశారు. కానీ, ఇప్పుడు ఆ ఊసేత్తడం లేదు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సిందే. లేదంటే ఉద్యమాలు చేస్తాం.

- ఆర్ కృష్ణయ్య, ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు

విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న ప్రభుత్వాలు బాగుపడ్డట్టు చరిత్రలో లేదు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్తారు. ఇచ్చిన హామీలు అమలుచేసి తీరాల్సిందే. గ్రూప్ 1 మెయిన్ పరీక్షలకు 1:50 కాకుండా 1:100 చొప్పున అభ్యర్థులను పిలవాలి. గ్రూప్-2, గ్రూప్-3లో అదనపు పోస్టులు కలుపుతామన్న మాటను నిలబెట్టుకోవాలి. పరీక్షకు పరీక్షకు మధ్య కనీసం 2 నెలల గ్యాప్ ఉండాలి. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా విద్యార్థుల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటది.

-ఎర్రోళ్ల శ్రీనివాస్
ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్

'నిరుద్యోగులను' రోడ్ల మీదకీడ్చిన కాంగ్రెస్

తప్పుడు హామీలు, అబద్ధపు ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి మోసం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను రోడ్లమీదకు ఈడ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. విద్యార్థుల తరపున గొంతెత్తి పోరాటం చేస్తాం. విద్యార్థులు, నిరుద్యోగుల తరపున పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

- గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్, జూన్ 20(నమస్తే తెలంగాణ): రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గురువారం హన్మకొండ, రామగుండం, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లో 37.8 డిగ్రీలు, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బ్రాహ్మణ పరిషత్తు మాజీ చైర్మన్ కేవీ రమణాచారి. చిత్రంలో ఎమ్మెల్సీ వాణీదేవి, దేవీప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి

బ్రాహ్మణ పరిషత్తుకు నిధులివ్వాలి

- విదేశాల్లో చదువుతున్నవారు కష్టాలు పడుతున్నారు
- బ్రాహ్మణ పరిషత్తు మాజీ చైర్మన్ కేవీ రమణాచారి

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవటంతో అక్కడ పనిచేసే ఉద్యోగులకూ జీతాలు ఇవ్వలేని దయనీయ పరిస్థితి ఉన్నదని, సంక్షేమ పరిషత్తు కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయని పరిషత్తు మాజీ చైర్మన్ కేవీ రమణాచారి అన్నారు. విదేశ విద్యానిధి పథకం ద్వారా నిధులు మంజూరై చాలా మంది విదేశాలకు వెళ్లారని, వారికి నిధులు విడుదల కాకపోవటంతో వారంతా విదేశాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బ్రాహ్మణులు అగ్రవర్ణాలకు చెందినా అనేకమంది పేదవాళ్లు ఉన్నారని, వారి సంక్షేమం కోసం కేసీఆర్ సీఎం అయ్యాక బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. బ్రాహ్మణుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. వెంటనే విదేశీ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు కూడా నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై శుక్రవారం క్యాబినెట్‌లో చర్చించాలని వెల్లడించారు. గతంలో ఆ పరిషత్తుకు చైర్మన్‌గా పనిచేసిన తాను ఇప్పుడున్న పరిస్థితి చూస్తుంటే మనసు విలవిలలాడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ పరిషత్తు ద్వారా 5 వేల మందికి వ్యాపార యూనిట్స్‌ను ఏర్పాటు చేశామని, వారిలో 1,879 మందికి నిధులు విడుదల చేయాల్సి ఉన్నదని తెలిపారు. వీటికి రూ.15 కోట్లు, విదేశ విద్యానిధి పథకానికి రూ.30 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నదని వివరించారు. పరిషత్తుకు కొత్త పాలకవర్గం ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే బ్రాహ్మణుల కోపానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే పలు సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ రాశానని వెల్లడించారు. 2025లో మహాకవి దాశరథి శతజయంతి ఉన్నదని, వచ్చే జూలై 22 నుంచి ఏడాది పాటు శత జయంతిని నిర్వహించాలని విన్నవించారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. బ్రాహ్మణుల గురించి ఆలోచించింది కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ప్రభుత్వాలు మారితే పథకాలు మంచిగా అమలు కావాలని, కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం మారితే పథకాలు ఆగిపోతున్నాయని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు నిధులు రెట్టింపు చేస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చెప్పిందని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ బీసీ కమిషన్‌తో వకుళాభరణం భేటీ

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు గురువారం తిరువనంతపురంలో కేరళ బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శశిధరన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కులగణన కోసం పాటించాల్సిన విధి విధానాలు, కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల మార్గదర్శకాలపై చర్చించారు. అధ్యయనాల నివేదికలను కేరళ కమిషన్ నుంచి సేకరించారు. తెలంగాణ బీసీ కమిషన్ ప్రస్తుత కార్యాచరణ ప్రణాళికను, కుల సర్వే వివరాలను కేరళ చైర్మన్‌కు వకుళాభరణం వివరించారు. కమిషన్ సభ్యుడు డాక్టర్ ఏవీ జార్జ్ పాల్గొన్నారు.

వరంగల్‌లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని లాక్కెళ్తున్న పోలీసులు

కళాతోరణంపై తీర్మానం చేయాల్సిందే

- పోడియం వద్దకెళ్లి బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసన
- 'గ్రేటర్ వరంగల్' బడ్జెట్ మీటింగ్ రచ్చరచ్చ
- బడ్జెట్ ప్రతులు చించేసిన మహిళా కార్పొరేటర్లు
- ఎమ్మెల్సీ పోచంపల్లి ఆధ్వర్యంలో బైఠాయింపు

వరంగల్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసనతో రచ్చరచ్చ అయింది. జీడబ్ల్యూఎంసీ బడ్జెట్ సమావేశం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.650.12 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను మేయర్ ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల మద్దతుతో నిరసనల మధ్యే ఏక పక్షంగా బడ్జెట్‌ను ఆమోదించారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగానే.. రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణాన్ని తొలగించేలా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, కాకతీయుల రాజధాని వరంగల్ కార్పొరేషన్‌లో ఈ మేరకు తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని బీఆర్ఎస్‌కు చెందిన డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పట్టుపట్టారు. వీటిని పట్టించుకోకుండా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్టు మేయర్ గుండు సుధారాణి ప్రకటించడంతో బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు పోడియం వద్దకు దూసుకుపోయి ఆమెతో వాగ్వాదానికి దిగారు. నిరసనలు, నినాదాల మధ్య జేఏవో సరిత బడ్జెట్‌ను చదువుతుండటంతో బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె చేతుల నుంచి బడ్జెట్ ప్రతులను లాక్కొని చించేశారు. మిగిలిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ సీట్ల వద్ద నిల్చొని పెద్దఎత్తున జై తెలంగాణ నినాదాలు చేశారు. ప్రతిగా కాంగ్రెస్ కార్పొరేటర్లు జై కాంగ్రెస్ నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి అడుగడుగునా పోలీసులను మోహరించారు. కౌన్సిల్ హాల్ వైపు ఎవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లను తనిఖీ చేసి కౌన్సిల్ హాల్‌కు అనుమతించారు. కాగా.. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్టు ప్రకటించిన మేయర్ సుధారాణి వెంటనే కౌన్సిల్ హాల్ నుంచి బయటకు వెళ్లిపోగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు ఆమెను అనుసరించారు. బీఆర్ఎస్ సభ్యులు అక్కడి నుంచి కౌన్సిల్ హాల్ గేటు వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలపగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లకు మధ్య తోపులాటలతో ఉద్రిక్తత నెలకొంది.

రిజర్వేషన్లపై సీఎం రేవంత్ కుట్ర

- న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టి అడ్డుకునే యత్నం
- అమలు చేయకుంటే జూలై 15న సెక్రటేరియట్ ముట్టడి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

మాట్లాడుతున్న రాజారాం యాదవ్

ఖైరతాబాద్, జూన్ 20: సమగ్ర కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ విమర్శించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాలతో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై ప్రైవేట్ వ్యక్తులతో కోర్టులో కేసు వేయించి న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టి దొడ్డి దారిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లను పెంచకుంటే జూలై 15న బీసీలతో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. దివంగత ప్రధాని నెహ్రూ నాడు కాకా కాలేల్కర్ కమిషన్‌ను అడ్డుకుంటే, ఇందిరాగాంధీ మండల్ కమిషన్ రిపోర్టును కోల్డ్ స్టోరేజీలో పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రిజర్వేషన్లిస్తే దేశం విచ్ఛిన్నమవుతుందని పార్లమెంట్ సాక్షిగా రాజీవ్‌గాంధీ మాట్లాడటం బీసీలపై గాంధీ కుటుంబానికి ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. సమావేశంలో బీసీ హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధేశ్వర్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ దత్తాత్రేయ, బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు శారదాగౌడ్ పాల్గొన్నారు.

F ఫారం నం.3
[రెగ్యులేషన్-15(1)(a)చూడండి]
డెట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్, కోల్‌కతాలో
9, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ స్ట్రీట్, 7వ అంతస్తు, కోలికతా-700001
అప్పీల్ నం. 116 ఆఫ్ 2022
జి. శిలిష ...అప్పిలెంట్
వర్సెస్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్
దిగువ వాలకి,
1. శ్రీ అల్లంశెట్టి రాఘవేంద్ర, నివాసం: ఇం.నం. 5-14-53/2, ప్లాట్ నం. 128, APHB కాలనీ, లక్ష్మీనగర్, హైదరాబాద్-500062. (రెస్పాండెంట్ నం.4)
2. శ్రీమతి శ్రీరాం శ్యామలాదేవి, శాంతినికేతన్ కాలనీ, మహేంద్ర హిల్స్ ఈస్ట్ మహేంద్రహిల్స్, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్-500026. (రెస్పాండెంట్ నం.12)
సమన్లు
1) S.A.No. 20 of 2019 (IA No. 3361/2019తో పాటు)లో 14-02-2020 తేదీన లెర్న్‌డ్ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-I, హైదరాబాద్ ద్వారా జారీచేయ బడిన ఉత్తర్వుపై మరియు ఇతర రిలీఫ్‌ల కొరకు SARFAESI యాక్ట్, 2002 లోని సెక్షన్ 18 క్రింద అప్పీల్‌ను అప్పిలెంట్ దాఖలు చేసారు. క్లెయిమ్‌కు సమాధాన మిచ్చుటకు 24-07-2024న ఉ.10.30 గం.కు లేదా ఆ తరువాత ట్రిబ్యునల్‌కు అనుకూలమైన సమయంలో ఈ గౌరవ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరు కావలసిందిగా మరియు వ్రాతపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా మీకు సమన్లు ఇవ్వడమైనది.
2) మీరు ఏవైనా డాక్యుమెంట్లు ఫైల్ చేయాలనుకుంటే, మీరు వ్రాత పూర్వక స్టేట్‌మెంట్‌తో పాటు జాబితాతో వాటిని దాఖలు చేయవచ్చు.
3) స్వయంగా లేదా తగువిధంగా ఆదేశించిన ప్లీడర్ / అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరైనపుడు మీ నమోదిత చిరునామా మరియు అప్పియరెన్స్ మెమోను మీరు దాఖలు చేయాలి.
4) పైన తెలిపిన తేదీన మీరు హాజరు కానిచో, మీ పరోక్షంలో ప్రొసీడింగ్ విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుందని గమనించగలరు.
10 జూన్, 2024న ఈ ట్రిబ్యునల్ సీల్‌తో నాచే ఇవ్వబడినది.
సమన్లు జారీచేసే అధీకృత అధికారి సంతకం

7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

- ఎమ్మార్పీఎస్ 30 ఏండ్ల ప్రస్థానం సందర్భంగా సభ
- మాదిగల మద్దతుతోనే పెరిగిన బీజేపీ ఓటు శాతం
- రేవంత్‌రెడ్డి వల్లనే కాంగ్రెస్‌కు ఎస్సీ, బీసీలు దూరం
- ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మందకృష్ణ

ఖైరతాబాద్, జూన్ 20: ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానం 30 ఏండ్లకు చేరుతున్న సందర్భంగా జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించనున్నట్టు సమితి అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సామాజిక ఉద్యమాల్లో ఎమ్మార్పీఎస్ మాత్రమే 30 ఏండ్లు పూర్తిచేసుకుందని చెప్పారు. ఎమ్మార్పీఎస్ అన్ని వర్గాల కోసం ఉద్యమం చేసిందన్నారు. మాదిగల మద్దతు వల్లే రాష్ట్రంలో బీజేపీకి 21 శాతం ఓట్లు వచ్చాయని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు బలంగా ఉన్న ప్రతి చోట బీజేపీ గెలిచిందన్నారు. బీజేపీ ఓటు బ్యాంకు పెరగటానికి పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డి సహకరించారని చెప్పారు. రేవంత్ రెడ్డి వల్లనే కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీలకు దూరమైందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశం కీలకంగా మారిన తరుణంలో కాంగ్రెస్ నుంచి ఒక్క మాదిగ ఎంపీ లేకుండా చేశారని, ఇది మాదిగలు బీజేపీకి మద్దతుగా నిలిచేందుకు దోహదపడిందని తెలిపారు. జూలై 7 వరకు సుప్రీంకోర్టు సెలవులు ఉంటాయని, ఆ వెంటనే వర్గీకరణపై తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, జాతీయ కార్యదర్శి విజయ్, ఎంఏఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ , ఎంఎస్పీ అధ్యక్షుడు టీవీ నరసింహ, శివకుమార్, విజయ్ పాల్గొన్నారు.

లా కోర్సు అడ్మిషన్ల జాప్యంపై వివరణివ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): న్యాయశాస్త్ర కోర్సుల ప్రవేశాల్లో జాప్యానికి కారణాలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ లాసెట్ కన్వీనర్‌కు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖను ఆదేశించింది. 2024- 25 విద్యాసంవత్సరంలో లా డిగ్రీ కోర్సుల అడ్మిషన్లలో జాప్యంపై న్యాయవాది ఏ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. విద్యాశాఖ తరపున కౌంటర